పార్టీనా.. పైసల్ కట్టు!

మందు పార్టీకి పర్మిషన్ తప్పనిసరి • ఆరు బాటిళ్ల నిబంధనలు అమలు • ఆన్‌లైన్‌లో అనుమతులు

సిటీబ్యూరో, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): పార్టీలు చేసుకుంటున్నారా.. అయితే మీపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నిఘా ఉంటుంది. హోటల్స్, ఫామ్ హౌస్‌లు, ఫంక్షన్ హాల్స్ ఇలా ఎక్కడ దావత్‌లు చేసుకున్నా మీ వద్దకు ఎక్సైజ్ శాఖ వచ్చి వాలుతుంది. ఆరు మద్యం బాటిళ్ల కంటే ఎక్కువగా తాగేశారంటే మీరు కేసులో ఇరుక్కోవాల్సిందే. ఏదైనా ఒక ప్రాంగణాన్ని అద్దెకు తీసుకొని అక్కడ పార్టీ చేసుకుంటున్నారంటే తప్పని సరిగా ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాల్సిందే. డబ్బులు పెట్టి మందుకొని, ఆ మందు తాగడానికి పర్మిషన్ తీసుకోవడమేమిటంటూ సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఒక వ్యక్తి ఆరు మద్యం బాటిళ్ల కంటే ఎక్కువ కల్గి ఉండకూడదనే నిబంధన ఉంది, దానిని అవసరాన్ని బట్టి అమలు చేస్తుంటారు. ఇండ్లలో జరిగే పార్టీలను మాత్రం చూసి చూడనట్లు వదిలేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఫామ్‌హౌస్‌లే టార్గెట్ ...

జీహెచ్ఎంసీ ప్రాంతంలో సాధారణ మద్యం పార్టీకి రూ. 12 వేలతో అనుమతి పొందాల్సి ఉంటుంది. అదే ఆ పార్టీలో 500 మంది హాజరవుతున్నారంటే దానికి రూ. 50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీయేతర ప్రాంతాల్లో రూ. 9 వేలు చెల్లించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం విక్రయాలు ఎక్కువ చేసి ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తుంది. శివారు ప్రాంతాల్లో ఫామ్ హౌస్‌లను టార్గెట్ చేసుకుంటూ అందినకాడికి జరిమానాలు వసూలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల శివారు ప్రాంతాలలో ఫామ్ హౌస్ కల్చర్ పెరుగుతుంది. దీంతో బంధువులు, స్నేహితులు, తోటి ఉద్యోగులు సమావేశాలు, గెట్ టు గెదర్ పార్టీలు చేసుకోవాలంటే ఒక చిన్న ఫామ్ హౌస్‌ను తీసుకుంటున్నారు. రూ. 5 వేలు పెట్టి ఫామ్‌హౌస్ కిరాయి తీసుకుంటే అందుకు డబుల్ వెచ్చించి లిక్కర్ పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరముంటుంది. ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చిన్న అవకాశాలను వదిలేయడం లేదు. ఒక పక్క రోజు రోజుకు పెరుగుతున్న బెల్ట్ దుకాణాలు, మరో పక్క లిక్కర్ అనుమతులంటూ ఎక్సైజ్ శాఖ ప్రజలను పీడిస్తుందని విమర్శలున్నాయి. లైసెన్స్ అనుమతి కోసం https://excise.telangana.gov.in/లో సంప్రదించాలని ఎక్సైజ్ శాఖ అదికారులు సూచిస్తున్నారు.

సమాచారం

రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ ఫెలోకు హెచ్‌సీయూ ప్రొఫెసర్

రవి కుమార్

కొండాపూర్, ఆగస్టు 13: బయాలాజికల్ సైన్సెస్‌లో విశిష్ట సేవలందించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం దక్కింది. వర్సిటీ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని బయోకెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రవి కుమార్ గుట్టిని రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ ఫెలోషిప్‌కు ఎంపిక చేసినట్లు వర్సిటీ యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రొఫెసర్ గుట్టి బ్లడ్ సెల్ అభివృద్ధిలో విశిష్ట సేవలను గుర్తించి ఈ ఫెలోషిప్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు.

5,6న ఏఐ గ్లోబల్ సమ్మిట్

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంతర్జాతీయ సదస్సుకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై రెండు రోజుల పాటు దేశ విదేశాలకు చెందిన టెక్నాలజీ నిపుణులతో పాటు ఔత్సాహిక ఏఐ స్టార్టప్‌ల నిర్వాహకులతో రెండు రోజుల పాటు సదస్సును నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 5-6 తేదీల్లో హెచ్ఐసీసీ వేదికగా జరగనున్న కార్యక్రమం రకరకాల అంశాలపై నిపుణులు కీలక ప్రసంగాలు చేయనున్నారు. ఆరోగ్య సంరక్షణ నుంచి విద్య వరకు, వాతావరణ మార్పు నుంచి వ్యవసాయం వరకు ఏఐతో మార్పులు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో టీ హబ్, హైసియా వంటి సంస్థలు సైతం ఏఐ గ్లోబ్ సమ్మిట్ నేపథ్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

మార్కెట్లోకి సింఫానీ స్మార్ట్ గీజర్లు

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా పేరొందిన సింఫానీ లిమిటెడ్ కంపెనీ కొత్త మోడల్ కూలర్‌లను, ఇతర గృహోపరణాలను ఆవిష్కరించింది. ఇప్పటి వరకు వినూత్న శైలిలో కూలర్‌లను ప్రవేశపెడుతూ వచ్చిన సింఫానీ కొత్తగా స్మార్ట్ వాటర్ గీజర్స్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చిందని కంపెనీ సీఎండీ ఆచల్ బకేరి తెలిపారు. మొట్ట మొదటి సారిగా ప్రజలకు ఇంట్లో అవసరమైన గీజర్‌లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ఆకర్షణీయమైన డిజైన్లతో రూపొందించిన గీజర్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టామని తెలిపారు.

తగ్గుతున్న ఫ్లాట్ సైజ్

నగరంలో పడిపోతున్న సగటు ఫ్లాట్ విస్తీర్ణం
ఏడాదిలోనే 13 శాతం తగ్గిందని వెల్లడించిన అనరాక్

సిటీబ్యూరో, ఆగస్ట్ 13(నమస్తే తెలంగాణ): మహానగరంలో ఫ్లాట్ల సైజ్ తగ్గుతోంది. ఓవైపు జనాలు విశాలమైన ఇండ్లకు ప్రాధాన్యతనిస్తుంటే మరోవైపు సగటు ఫ్లాట్ విస్తీర్ణం ఒక్క ఏడాదిలోనే 13శాతం పడిపోయింది. దీంతో 2271 చదరపు అడుగుల నుంచి 2010 చదరపు అడుగులకు పడిపోయినట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తాజాగా వెల్లడించింది. గడిచిన మూడేళ్లలో నివాసం ఉండే ఫ్లాట్ విస్తీర్ణం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అనూహ్యంగా సైజు తగ్గిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ కేంద్రంగా లగ్జరీ ఇండ్లకు కాలం చెల్లినట్లేనని, కొనుగోలుదారుల సంఖ్య తక్కువ ఉండటమే కారణాలుగా తెలుస్తోంది. 2023 నుంచి ఇప్పటివరకు క్రమంగా ఫ్లాట్ విస్తీర్ణం తగ్గడానికి కొనుగోలుదారులు అనాసక్తి చూపుతున్నారని, దీంతో రానున్న రోజుల్లో లగ్జరీ ఇండ్ల కంటే సామాన్యుడు కొనుగోలు చేసేందుకు వీలుగా ఉండే ప్రాజెక్టులు మాత్రమే మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ భారీ విస్తీర్ణంలో ఉండే ఫ్లాట్లను నిర్మించినా... అమ్మకాలు, వాటి సంఖ్య పరిమితంగా ఉండే పరిస్థితులు నెలకొంటున్నాయి. అనరాక్ వెల్లడించిన నివేదిక ప్రకారం దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో క్రమంగా ఫ్లాట్ ఏరియా తగ్గుతుందని తేలింది. అయితే దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో విశాలమైన ఫ్లాట్లను కలిగిన నగరాల్లో హైదరాబాద్ రెండో స్థానంలో ఉండగా, జాబితాలో ఎన్‌సీఆర్ ఢిల్లీ 2450 చదరపు అడుగుల సగటు ఫ్లాట్ ఏరియాతో అగ్రస్థానంలో నిలిచింది.

నగరం	సగటు ఫ్లాట్ సైజ్
ఎన్‌సీఆర్ (ఢిల్లీ)	2450 చ.అ.
హైదరాబాద్	2010 చ.అ.
బెంగళూరు	1630 చ.అ.
చెన్నై	1450 చ.అ.
కోల్‌కతా	1125 చ.అ.
పుణే	1103 చ.అ.
ముంబయి (ఎంఎంఆర్)	825 చ.అ.

పోలీసుల అదుపులో నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్న ముఠాను పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. భువనగిరి పట్టణంలోని సమ్మద్ చౌరస్తాలో గల ఏటూ జెడ్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ పేరుతో ఇంటర్నెట్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న అబ్దుల్లా అలియాస్ గణేశ్‌తోపాటు పట్టణంలోని గాంధీ పార్కు ఎదురుగా గల కార్తీక్ బైండింగ్ వర్క్ పేరుతో రబ్బర్ స్టాంపులు తయారు చేస్తున్న ఎం.గిరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న కంప్యూటర్లను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. అబ్దుల్లా సర్టిఫికెట్లు తయారు చేయగా, వాటిపై గిరి తయారు చేసిన ముద్రలు వేసి విక్రయిస్తున్నట్లుగా సోమవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని పట్టణ పోలీసు అధికారులు తెలిపారు.

కేరళ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

యాదగిరిగుట్ట, ఆగస్టు 13 : కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో జరిగిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ అన్నారు. వరదల కారణంగా కొండ చరియలు విరిగిపడి నిరాశ్రయులైన బాధితులకు అండగా మంగళవారం నిధి సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రానికి చేయూతగా కేంద్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు ప్రకటించాలన్నారు. దేశంలో ఎక్కడ ఆకస్మిక విపత్తులు సంభవించినా ఐకమత్యంతో సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉన్నదని పేర్కొన్నారు. విపత్తును ముందే పసిగట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బండి జంగమ్మ, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు కంబాల వెంకటేశ్, నాయకులు బంగారు, వెంకటేశ్, మల్లయ్య, నర్సింహ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : భువనగిరి పట్టణంలోని తాతానగర్‌కు చెందిన రత్నపురం ముత్యాలు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి పని నిమిత్తం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, బ్లూ కలర్ చెక్స్ షర్టు, బ్లూ కలర్ ప్యాంట్ ధరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాధ్యతతో పని చేసిన వారికి గుర్తింపు

మోత్కూరు, ఆగస్టు 13 : బాధ్యతతో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ కౌన్సిలర్లు లెంకల సుజాత, ఎర్రవెల్లి మల్లమ్మ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం పని చేసి ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులకు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు గంధం శ్రీనివాస్‌రావు, బోళ్ల హనుమంతు, వై.రవీందర్‌రెడ్డి, జి.పుష్పలతను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆవుల వెంకటేశ్వర్లు, ఏఏపీసీ చైర్మన్ టి.మాధవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

మోత్కూరు : పీహెచ్‌సీలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు మంగళవారం వీడ్కోలు సన్మానం చేశారు. పీహెచ్ఎన్ టీకేఆర్ లక్ష్మి, హెచ్ఈఓ భాస్కర్‌రాజు, సూపర్‌వైజర్ కృష్ణ, స్టాఫ్ నర్సు స్లీవమ్మ, ఏఎన్ఎం రాములమ్మ, శైలజ, అటెండర్ కృష్ణకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్, అమరావతి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీనోమ్ వ్యాలీని సందర్శించి సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్

సురక్షిత ఔషధాలు తయారు చేయాలి

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట, ఆగస్టు 13: వ్యక్తిగత ఆరోగ్యం, పర్యావరణంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపకుండా సురక్షితమైన ఔషధాలు తయారు చేయాలని ఫార్మా సంస్థలకు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఉమ్మడి శామీర్‌పేట మండలం జీనోమ్ వ్యాలీలోని కెమో ఇండియా ఫార్ములేషన్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ బయోటెక్, బయాలాజికల్ ఈ లిమిటెడ్‌లను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రామాణిక ఆపరేటింగ్ విధానంలో ఔషధాల తయారీలో క్రమబద్ధమైన పద్ధతిలో పరిశోధనలు చేస్తూ వాటి యొక్క నాణ్యత పరమైన ప్రమాణాలను పాటిస్తున్న తీరును పరిశీలించామన్నారు. నూతన ఔషధాల ఆవిష్కరణ విధానంలో చేస్తున్న పరిశోధనలను మరింతగా అభివృద్ధి చేయాలని కోరారు. ఔషధాల ఉత్పత్తి కోసం వివరణాత్మకమైన పరిశోధన, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఔషధాల నిల్వల కోసం నాణ్యతా పరమైన తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రశాంత్‌కుమార్, జనరల్ మేనేజర్ డీఐసీ చంద్రశేఖర్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ ఎంవీ.వెంకటశేఖర్, సాయి కృష్ణ, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్‌లు, టీఎస్ఐఐసీ అధికారులు అనురాధ, జోనల్ మేనేజర్ వినయ్‌కుమార్, ఐఏఎల్ఏ కమిషనర్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపు

రాయితీ కూపన్‌ను లాంచ్ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొండాపూర్, ఆగస్టు 13 : పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చేలా రాష్ట్ర పర్యాటక శాఖ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం టూరిజం ప్రమోషన్‌లో భాగంగా ఐటీ ఉద్యోగులు, యువతతో హైటెక్‌సిటీలోని రహేజా మైండ్ స్పేస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించి, పర్యాటకులను ఆకర్షించేందుకు తానే స్వయంగా సేల్స్‌మెన్ అవతారమెత్తినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రత్యేకమని, చరిత్ర, వారసత్వ సంపద, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన జలపాతాలు, జలవనరులు, దేవాలయాలు, ఎకో టూరిజం, ట్రైబల్ టూరిజం, మెడికల్ టూరిజం వంటి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఐటీ ఉద్యోగులకు హరిత హోటల్స్‌లో 15 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐటీ ఉద్యోగులతో కలిసి రాయితీ కూపన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ సంచాలకులు ఇలా త్రిపాఠి, రహేజా గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోనే శ్రవణ్ కుమార్, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మెంబర్ బిపిన్ చంద్ర,ఐటీ ప్రమోషన్ అమరనాథ్‌రెడ్డి, ఐటీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ ఐటీఐని హబ్‌గా మారుస్తాం

మేడ్చల్, ఆగస్టు 13 : మేడ్చల్ ఐటీఐని హబ్ ఐటీఐగా ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్టు కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమల ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మేడ్చల్ ఐటీఐ కళాశాలను సందర్శించారు. ఐటీఐలో బోధిస్తున్న కోర్సులు, నూతనంగా జరుగుతున్న నిర్మాణ పనులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఐటీఐని సమీపంలో ఉన్న ఐటీఐతో కలిపి హబ్ ఐటీఐగా ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) అనే పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నైపుణ్యం గల యువతను తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణనిచ్చే కేంద్రం ఏర్పాటు కోసం మేడ్చల్ ఐటీఐ పరిశీలిస్తున్నామన్నారు. కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, జేసీ నాయక్, ఐటీఐ ప్రిన్సిపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ

సిటీబ్యూరో, ఆగస్ట్ 13(నమస్తే తెలంగాణ) : వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ డే సందర్భంగా యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో సెలబ్రేటింగ్ సెకండ్ ఛాన్సెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవయవ దానంపై అవగాహన పెంచేలా, ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ఉన్న అపోహలు, అనుమానాలు దూరం చేసేలా సికింద్రాబాద్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్. డా. పవన్ గోరుకంటి పాల్గొని మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో అవయవాలు అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి వారి ప్రాణాలను నిలిపేలా అవయ దానం ఎంతో మేలు చేస్తుందన్నారు. యశోద హాస్పిటల్ ద్వారా కూడా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లుగా తెలిపారు. ఇప్పటికే ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకున్నవారితో అవగాహన పెంచేలా కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా సికింద్రాబాద్ యూనిట్ హెడ్ డా. విజయ్ కుమార్ తెలిపారు.

రోబోటిక్ సర్జరీలో నిమ్స్ దూకుడు

ఏడాది కాలంలో 300 సర్జరీలు

డాక్టర్ బీరప్ప

డాక్టర్ రాహుల్

సిటీబ్యూరో, ఆగస్ట్ 13(నమస్తే తెలంగాణ) : రోబోటిక్ సర్జరీలో నిమ్స్ దూసుకుపోతున్నది. ప్రభుత్వ హాస్పిటళ్లలో అత్యంత వేగవంతంగా ఈ మైలురాయిని చేరుకోగా, ఏడాది కాలంలోనే 300 రోబోటిక్ సర్జరీలను నిమ్స్ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. రోబోటిక్ అసిస్టెంట్ సర్జరీ పేరిట ఈ సేవలను వినియోగంలోకి తీసుకురాగా అనతి కాలంలోనే చేరుకున్నది. యూరాలజీ, గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సర్జరీ, సర్జికల్ అంకాలజీ విభాగాల ద్వారా అనేక క్లిష్టమైన శస్త్ర చికిత్సలను కూడా సునాయాసంగా అందిస్తున్నారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ బీరప్ప నగరి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోబోటిక్ సర్జరీ వైద్య రంగంలోనే సంచలనాత్మకంగా మారిందన్నారు. ఈ క్రమంలో అధునాతన సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ వైద్య సేవలు అందించడం తాము సాధించిన విజయమేనన్నారు. ఇందుకు సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోబోటిక్ సర్జరీ కో ఆర్డినేటర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ సర్జరీల్లో టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వ సహకారం విప్లవాత్మక వైద్య సేవలకు కారణమైందన్నారు. రోబోటిక్ అసిస్టెంట్ సర్జరీ టెక్నాలజీ తయారీ సంస్థ ఏపీఏసీ ఆఫ్ ఇంటూటివ్ వీపీ డార్ల హట్టన్ మాట్లాడుతూ సర్జికల్ సిస్టమ్‌ను ఏకీకృతం చేయడంతో వైద్య రంగంలో ముఖ్యమైన దశను చేరుకున్నామన్నారు.

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రమాణం చేస్తున్న పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ సభ్యులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 13 : తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.జయశ్రీ, కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎ.హరిశంకర్, జాయింట్ సెక్రటరీగా పి.అపర్ణ, ఎ.సంతోష్, జి.పావని, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.నాగరాజు, ఎన్.నాగజ్యోతి, ఎ.సారంగపాణి, జేసీసీ సభ్యుడిగా కె.నాగేందర్, ట్రెజరర్‌గా కె.రమేశ్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులుగా జి.జ్ఞానప్రకాశ్‌రెడ్డి, కె.రమేశ్, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ ఇలియాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంపాల సత్యనారాయణరెడ్డి, ఎన్నికల అధికారి సీహెచ్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సమర్థవంతంగా చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 13 : రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సమర్థవంతంగా చేపట్టాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టబోయే ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు సంబంధించిన విధివిధానాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల వారీగా వన మహోత్సవం లక్ష్యాలను ప్రకారం మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ దినకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

డాక్టరేట్ అందుకున్న టీచర్ వినోదరాణిని సన్మానిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

బొమ్మలరామారం, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో పీజీటీ ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న ఎన్.వినోదరాణి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్.నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో స్ట్రక్చరల్, ఆప్టికల్, ఎలక్ట్రికల్ అండ్ యాంటీ మైక్రోబియర్ ప్రాపర్టీస్ ఆఫ్ సమ్ మోసోవలెంట్ మెటాలిక్ ఆక్సైడ్ బోరేట్ గ్లాసెస్ అనే అంశంపై పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి పట్టా పొందారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చిలువేరు మహేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఆమెను సన్మానించారు.

తుక్కాపురం పాఠశాలకు టీచర్ నియామకం

తుక్కాపురం పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 13 : మండలంలోని తుక్కాపురం ప్రాథమిక పాఠశాలకు టీచర్ వచ్చారు. ఆ పాఠశాలకు 11రోజులుగా ఉపాధ్యాయులు రాకపోవడంతో ఈ నెల 10న నమస్తే తెలంగాణలో 'మా స్కూల్‌కు టీచర్లను నియమించండి.. ప్లీజ్' శీర్షికతో కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన డీఈఓ, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయురాలిని నియమించారు. మంగళవారం టీచర్ వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయురాలి నియామకంతో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రామనర్సమ్మ, మాజీ సర్పంచ్ రాజు హర్షం వ్యక్తం చేస్తూ నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

తాను చనిపోతూ నలుగురికి అవయవదానం